
సాక్షి
తిరుపతి
గురువారం, 8, ఆగస్టు, 2024



తాగి దొరికితే చెరసాలకే ..!

తిరుపతి జిల్లావ్యాప్తంగా పోలీసులు మందుబాబులను నియంత్రించేందుకు విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. - 8లో



ధాన్యం లారీ బోల్తా

ధాన్యం నింపుకుని వస్తున్న ఓ లారీ భాకరాపేట ఘాట్ రోడ్డులో డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపడంతో బోల్తా పడింది - 8లో



చికిత్స కంటే నివారణే ఉత్తమం

ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని శ్రీసిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు - 8లో

న్యూస్‌రీల్

మేలు రకం ధాన్యంలోకి నాసిరకం కల్తీ



దిగువచావలి గ్రామం వద్ద వడ్లను కల్తీ చేసి లోడింగ్ చేస్తున్న దృశ్యాలు

పెళ్లకూరు: మండలంలోని దిగువచావలి గ్రామం ఫ్లైఓవర్ కింద వేర్వేరు ప్రాంతాల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కల్తీ చేసి విక్రయిస్తుండడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ వరికోతలు చేపట్టిన తరుణంలో కొందరు వ్యాపారులు సాధారణ రకం ధాన్యాన్ని, మేలు రకం ధాన్యంతో కలిపి కల్తీ చేసి లారీలతో వేర్వేరు పట్టణాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. సాధారణ రకం ధాన్యాన్ని తక్కువ ధరలకు రైతుల నుంచి కొనుగోలు చేసి, వాటిలోకి మేలు రకం ధాన్యం కల్తీ చేసి అధిక ధరలతో విక్రయించి వ్యాపారులు జేబులు నింపుకుంటున్నారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ధాన్యం కల్తీ జరగకుండా చర్యలు చేపట్టాలని పలువురు రైతులు కోరుతున్నారు.

ఐటీఐలో మూడోదఫా ప్రవేశాలకు దరఖాస్తులు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో మూడో దఫా ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తిరుచానూరు రోడ్డు, పద్మావతీపురంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్, కన్వీనర్ వి.శ్రీలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5గంటలలోపు ''ఐటీఐ.ఏపీ.జీఓవి.ఇన్'' వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అభ్యర్థులు తాము చేరదలచిన ఐటీఐ కళాశాలను వెబ్‌సైట్‌లో ఆప్షన్ పెట్టుకుని తరువాత సమీపంలోని ఏదైనా ప్రభుత్వ ఐటీఐ కళాశాలకు వెళ్లి సర్టిఫికెట్లను పరిశీలన చేయించుకోవాలని సూచించారు. ఈ నెల 29న ప్రభుత్వ ఐటీఐలో చేరదలచిన వారికి, 31న ప్రైవేటు ఐటీఐలో చేరదలచిన వారికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని, దీనికి సంబంధించి అభ్యర్థులకు ఎటువంటి కాల్ లెటర్లు పంపబడవని పేర్కొన్నారు. వివరాలకు 85000 21856, 94908 06942 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

చేతివృత్తులను ప్రోత్సహించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న పద్మావతి మహిళా వర్సిటీ అధికారులు, విద్యార్థులు

తిరుపతి సిటీ: చేతివృత్తులను ప్రోత్సహించినప్పుడే దేశ సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుందని మహిళా వర్సిటీ వీసీ వి.ఉమ అభిప్రాయపడ్డారు. బుధవారం మహిళా వర్సిటీలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేత వస్త్రాలు ధరించి విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించి చేనేత రంగాన్ని ప్రోత్సహించాలంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమానికి వీసీ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ చేనేత, చేతివృత్తుల ద్వారా తయారైన వస్తువులను విరివిగా ఉపయోగించాల్సిన అవసరం ఉందన్నారు. చేనేత వస్తువలు భారతీయ సంస్కృతికి నిలువుటద్దం అన్నారు. వీటి ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రజిని, డీన్లు సుజాతమ్మ, వాణి, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్లు విద్యావతి, ప్రోగ్రాం ఆఫీసర్లు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యంపై విజిలెన్స్ దాడులు



సోమలలో విద్యుత్ కనెక్షన్లను తనిఖీ చేస్తున్న విద్యుత్‌శాఖ విజిలెన్స్ ఈఈ బాలాజీ

తిరుపతి రూరల్: విద్యుత్ అక్రమ వాడకంపై విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం దాడులను ముమ్మరం చేస్తోంది. బుధవారం సోమల సెక్షన్ పరిధిలోని సోమల, కందూరు, కామిరెడ్డిగారిపల్లి, తమ్మినాయనపల్లి, నెల్లిమంద, వల్లికట్ల, ఇరికిపెంట, దిడ్డివారిపల్లి గ్రామాల్లో విద్యుత్ విజిలెన్స్ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు పుల్లా బాలాజీ ఆధ్వర్యంలో ఏకకాలంలో దాడులు నిర్వహించారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న గృహాలు, దుకాణాలపై 92 కేసులను నమోదు చేసి, రూ.2.81 లక్షలను జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడడం చట్టరీత్యా నేరమని, నిందితులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. దాడుల్లో విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.



• నాన్నే నడకయ్యాడు

నువ్వు కన్న కలలే నిజమవుతాయి చూడు..
అందుకే ఉన్నాడు ఈ నాన్నే తోడు..
దశరథ మహారాజే నాన్నయి పుట్టాడు..
నువ్వు రాముడంత ఎదగరా నేడు..

బిడ్డకు తల్లి జన్మనిస్తే.. తండ్రి జీవితం ఇస్తాడు. బతుకుపోరులో ముందుకు సాగే మనోధైర్యం అందిస్తాడు. ఇందుకు నిలువెత్తు నిదర్శనంగా హనుమంతు అనే ఓ నిరుపేద నాన్న కనిపిస్తున్నాడు. 14 ఏళ్ల వయసున్నా, నడవలేని ఓ కుమారుడికి తానే నడకయ్యాడు. ఉన్నతంగా చదువుకోవాలనే తనయుడి ఆకాంక్షను తీర్చే బాధ్యతను భుజానికెత్తుకున్నాడు. రెక్కాడితే కానీ డొక్కాడని స్థితిలోనూ రోజూ తన బిడ్డను మోసుకుంటూ పాఠశాలకు తీసుకెళ్లి.. సాయంత్రం ఇంటికి తీసుకొస్తున్నాడు. కొడుకు ఆశ నెరవేర్చడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాడు. పొట్టకూటి కోసం కర్నూలు నుంచి తిరుపతికి వచ్చిన ఓ తండ్రి.. దివ్యాంగుడైన బిడ్డను కడుపులో పెట్టుకుని చూసుకుంటూ.. దివ్యమైన భవిష్యత్ అందించేందుకు శ్రమిస్తూ బాధ్యతకు నిజమైన సాక్ష్యంగా నిలుస్తున్నాడు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

• కార్మికలోకం కన్నెర్ర



తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ, అగ్రికల్చరల్ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులపై వేధింపులు మానుకుని సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నేతల ఆధ్వర్యంలో బుధవారం అగ్రికల్చరల్ కళాశాల ప్రధాన ద్వారం వద్ద ధర్నా నిర్వహించారు. గత నాలుగు నెలల నుంచి జీతాలు లేకుండా కార్మికులు ఆకలితో అలమటిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే పెద్దఎత్తున నిరసన చేపడతామని ఏడీఆర్‌కు వినతిపత్రం ఇచ్చారు.

– తిరుపతి సిటీ

ఉపాధి.. హామీ ఏదీ?

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అక్కడే ఉపాధి కల్పించేందుకు ఉద్దేశించిన ఉపాధిహామీ పథకం ఇప్పుడు భారంగా మారిపోతోంది. కష్టపడి పని చేసినా కొన్ని రోజులుగా కూలి అందకపోవడంతో కుటుంబ పోషణకు ఇబ్బంది పడుతున్నారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా గత కొన్ని నెలలుగా ఉపాధిహామీ పనులు చేసిన కూలీలకు కూలి అందడం లేదు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ 100 రోజులు పని కల్పించాలనేది పథకం ముఖ్య ఉద్దేశం. కానీ అసలు వేతనాలే అందకపోవడంతో ఉపాధిహామీ పనులకు వెళ్లేవారి సంఖ్య తిరుపతి జిల్లాలో గణనీయంగా పడిపోయింది.

- మే నెల నుంచి కూలీలకు అందని వేతనాలు
- తిరుపతి జిల్లాలోనే లక్షమంది వరకు బకాయిలు
- పనులకు వెళ్లేందుకు వెనకడుగు వేస్తున్న శ్రమజీవులు
- ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపుపైనే కూటమి సర్కారు దృష్టి
- గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో సకాలంలో వేతనాలు
- కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి అందని వేతనాలు
- తిరుపతి జిల్లాలో గణనీయంగా పడిపోతున్న కూలీల సంఖ్య

దక్కిలి: కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం లక్ష్యం నీరుగారుతోంది. గతంలో పనులకు వచ్చేవారు జాతరకు వచ్చినట్లు వచ్చేవారు. అయితే గత మూడు నెలల నుంచి వేతనాలు సకాలంలో అందకపోవడం వల్ల తిరుపతి జిల్లాలో కూలీల సంఖ్య గణనీయంగా పడిపోయింది. రోజుకు సగటున లక్ష మందికి పైగా వచ్చే కూలీలు రానురాను తగ్గిపోతున్నారు. మే నెలలోనే జిల్లాలో సుమారు లక్షమంది ఉపాధిహామీ పనులకు హాజరు కాగా, జూన్, జూలై నెలల్లో సగానికి పైగా తగ్గిపోయారు. వేతనాలు అందకపోవడం వల్లే కూలీల సంఖ్య తగ్గిందన్న విషయంపై ఆ శాఖలోనే చర్చ సాగుతోంది. ప్రతి రోజు సగటున ప్రతి మండలంలో 3 వేల నుంచి 5 వేలమంది ఉపాధి పనులకు వెళ్లేవారు. ప్రస్తుతం కొన్ని మండలాల్లో సగటున 900 మంది కూడా వెళ్లట్లేదు.

మూడు నెలలుగా బ్రేక్..

జిల్లాలో లక్షమంది కూలీలకు సుమారు రూ.120 కోట్లు వేతనాలు అందాల్సి ఉంది. సుమారు మే నెల మొదటి వారం నుంచి 11 వారాలుగా బిల్లుల చెల్లింపులు నిలిచిపోయాయి. రోజుకు కనీసం రూ.300 చొప్పున వస్తుందని అధికారులు చెప్పారు. ప్రభుత్వం చొరవ పట్టించుకోకపోవడం కూడా ఇందుకు ప్రధానం కారణం. గతంలో ప్రతి 15 రోజులకు ఒకసారి కూలీల బ్యాంకు ఖాతాల్లో నగదు జమయ్యేది. ప్రస్తుతం దాదాపు 11 వారాలు అయినా పడలేదు. ఒక్కో కూలీకి సరాసరి 60 నుంచి 66 రోజుల వరకు కూలి అందాల్సి ఉంది. సగటున ఒక్కో కూలీకి రోజుకు రూ.200 చొప్పున లెక్క వేసుకున్నా సుమారుగా రూ.10 వేలు మేర అందాల్సి ఉంది. వేతనాలు సక్రమంగా చెల్లించకపోవడంతో కొద్ది రోజులుగా కూలీలు పనులకు వెళ్లడానికి వెనుకడుగు వేస్తున్నారు. గతంలో వేలల్లో పనులకు వెళ్లే వారుండగా, ప్రస్తుతం వందల్లోనే వెళ్తున్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపులో సర్కారు..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక కూలీలకు వేతనాలు ఇచ్చే దానిపై దృష్టి సారించలేదు. ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపుపైనే దృష్టి పెట్టింది. ఇది కూడా కూలీలకు బిల్లు అందకపోవడానికి ప్రధాన కారణం అనే విమర్శలు కూలీల నుంచి వ్యక్తం అవుతున్నాయి. గతంలో సీఎంగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కరోనా సమయంలో ఉపాధిహామీ నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేయకపోయినా, సకాలంలో అందజేశారు. అప్పట్లోనే వివిధ రాష్ట్రాల నుంచి సొంత గ్రామాలకు వచ్చిన వలస కూలీలకు జాబ్‌కార్డులు మంజూరు చేయించి పనులు కల్పించారు. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇన్ని రోజులు అవుతున్నా, నిధులు విడుదల చేయకపోవడంతో శ్రమజీవులు నిరాశలో ఉన్నారు. సార్వత్రిక ఎన్నికల వరకూ ఉపాధి పనులు జోరుగా సాగేవి. వేతనాల చెల్లింపులు సైతం సకాలంలో అందేవి. వారం వ్యవధిలోనే కూలీల ఖాతాల్లో నగదు జమయ్యేది. దీంతో ఉపాధి పనులకు వెళ్లే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ఉపాధిహామీపై శ్రద్ధ చూపకపోవడంతో రెండు నెలలుగా వేతనాల చెల్లింపులు పూర్తిగా నిలిచిపోయాయి.



దక్కిలి: ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు

జిల్లాలో మొత్తం మండలాలు 34	గ్రామ పంచాయతీలు 806
తిరుపతి జిల్లాలో మొత్తం జాబ్‌కార్డులు 2.64లక్షలు	ఉపాధిహామీ కూలీలు 4.54 లక్షలు
యాక్టివ్ జాబ్‌కార్డులు 2.19లక్షలు	కూలీలు 3.55లక్షలు
రావాల్సిన బకాయిలు సుమారు 120 కోట్లు	

త్వరలోనే వేతనాలు జమ..



ఉపాధిహామీ పనులు చేసిన కూలీలందరికీ త్వరలోనే వేతనాలు అందుతాయి. కేంద్ర ప్రభుత్వం త్వరలో నిధులు విడుదల చేయనుంది. కూలీలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. పని చేసిన వారికి కూలి సొమ్ము అంతా వారి ఖాతాల్లోకి జమ అవుతుంది. కూలీలు యథావిధిగా పనులకు వెళ్లండి.

– లక్ష్మీనారాయణ, ఏపీఓ, దక్కిలి

ఉద్దేశం ఇదీ..

వలసలను నియంత్రించి, స్వగ్రామంలోనే ఉపాధి చూపించాలన్న లక్ష్యంతో కేంద్రప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని అమలు చేస్తోంది. తద్వారా ఒక్కో కుటుంబానికి ఏడాదికి వందరోజులు పని కల్పించాలన్నది ముఖ్య లక్ష్యం. పని కావాలని అడిగిన ప్రతి ఒక్కరికీ పని చూపించాల్సిన బాధ్యత అధికారులదే. ఈ పథకంలో వ్యవసాయ అనుబంధ, ఇతర అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తారు. కూలీలు చేపట్టే పనులకు మొదటి ప్రాధాన్యం ఉంటుంది. మెటీరియల్ కాంపొనెంట్ నిధులతో ప్రభుత్వ ప్రాధాన్య పనులు చేపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, సిమెంట్ రోడ్లు, మురుగు కాలువలు, గ్రామాల అభివృద్ధి పనులను ఈ నిధులతో చేపడుతున్నారు.



అమాయకుల కడుపుకొట్టొద్దు



మాట్లాడుతున్న ఎంపీపీ శేఖర్‌రెడ్డి

పెళ్లకూరు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద పనులు చేయించే క్షేత్ర సహాయకులను అన్యాయంగా తొలగించి అమాయకుల కడుపుకొట్టొద్దని ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి సూచించారు. బుధవారం ఆయన స్థానిక ఏపీఓ దయానంద్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అన్నపూర్ణారావుతో ఎంపీపీ కార్యాలయ భవనంలో ఆయన మాట్లాడారు. ఉపాధిహామీ పనులు చేయించే ఫీల్డ్ అసిస్టెంట్లపై రాజకీయ కక్షలు ఏంటని ప్రశ్నించారు. మండలంలో అన్ని పార్టీల నాయకులు సామరస్యంగా ఉన్నారని, కానీ కొందరు అధికారులు చేస్తున్న అత్యుత్సాహం వల్లే ఫీల్డ్‌అసిస్టెంట్లను బలి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లు స్వచ్ఛందంగా రాజీనామా చేస్తారా? లేదా గడిచిన పదేళ్లలో చేపట్టిన ఉపాధి పనుల్లో అవినీతి, అక్రమాలపై తనిఖీలు చేయించేలా జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయమంటారా ? అని వారిని బెదిరించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ఇప్పటికైనా సక్రమంగా పని చేయడం నేర్చుకోవాలని ఆశాఖ ఏపీఓకు సూచించారు. ఒకవేళ ఉపాధిహామీ పనుల్లో అవినీతి జరిగి ఉంటే అందులో ఏపీఓ పాత్ర కూడా ఉంటుందన్న విషయాన్ని మర్చిపోవద్దని హెచ్చరించారు. మండలంలో టీడీపీ నాయకులు చేస్తున్న దౌర్జన్యాలు, బెదిరింపులపై స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీని కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యురాలు ప్రిస్కిల్లా ఉన్నారు.



ఆరోగ్యకర సమాజాన్ని నిర్మిద్దాం



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపల్ ఉమా ముద్దుబాల

– ప్రొఫెసర్ డాక్టర్ మల్లికార్జున

తిరుపతి కల్చరల్: నికోటిన్, కొకైన్, బ్రౌన్ షుగర్ వంటి డ్రగ్స్‌కు యువత దూరంగా ఉన్నప్పుడే ఆరోగ్యకరమైన సమాజాన్ని మనం నిర్మించుకోగలమని ఎస్వీ మెడికల్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మల్లికార్జున తెలిపారు. ఎస్వీ సంగీత, నృత్య కళాశాలలో బుధవారం పొగాకు, డ్రగ్స్ నిర్మూలన అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పొగాకు, గంజాయి, మద్యం వంటివి డ్రగ్స్ మన దేశంలో అధికంగా వాడుతున్నారని, యవ్వన దశలో ఈ డ్రగ్స్‌కు బానిసలుగా మారుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోందని తెలిపారు. ప్రతి విద్యాసంస్థలో డ్రగ్స్ నిర్మూలన పట్ల అవగాహన సదస్సులు ఏర్పాటు చేయడం ద్వారా యువతలో పరివర్తన తీసుకురావచ్చన్నారు. డాక్టర్ ముకుంద నాయుడు మాట్లాడుతూ డ్రగ్స్‌కు బానిసలైన వారిని సాధారణ స్థితికి తీసుకురావడానికి డీఅడిక్షన్ సెంటర్లు అందుబాటులో ఉన్నాయన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఉమా ముద్దుబాల మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను అనునిత్యం పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. కార్యక్రమంలో వయోలిన్ విభాగాధిపతి డాక్టర్ కేవీ.కృష్ణ, మృదంగం విభాగాధిపతి ఎం.సుధాకర, వీణ విభాగాధిపతి యాళ్ల శ్రీవాణి, సీనియర్ ఫ్యాకల్టీ డాక్టర్ కె.వందన, ఎస్వీ నాదస్వర, డోలు పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేతన్నకు సంపూర్ణ సహకారం

- జాతీయ చేనేత దినోత్సవంలో కలెక్టర్ వెంకటేశ్వర్
- నేతన్నలకు ఘన సన్మానం



చేనేత కార్మికుడికి జ్ఞాపికను అందజేస్తున్న జిల్లా కలెక్టర్

వెంకటగిరి(సైదాపురం): చేనేత పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం అందిస్తామని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ స్పష్టం చేశారు. 10వ జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని వెంకటగిరి పట్టణంలో బుధవారం భారతీయ చేనేత శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులు చేపట్టిన ర్యాలీ కార్యక్రమాన్ని కలెక్టర్ స్థానిక ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం పద్మశాలీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ చేనేత రంగాన్ని మెరుగు పరిచే దిశగా దేశ ప్రధాని ఏటా ఆగస్టు 7వ తేదీన చేనేత దినోత్సవం జరుపుకులానే ప్రకటించడం జరిగిందన్నారు. చేనేత రంగాన్ని ఏపీలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. చేనేత కార్మికులకు కొత్త పెన్షన్లు మంజూరుతో పాటు రాయితీల విషయం కూడా సంబంధిత అధికారులతో చర్చించి సత్వరమే పరిష్కరిస్తామన్నారు. తిరుపతి జిల్లాలో పరిశ్రమలు అధికంగా ఉన్నాయని, ఇందులో భాగంగా వెంకటగిరిలో టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

కార్మికులకు సన్మానం

అనంతరం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, కలెక్టర్ వెంకటేశ్వర్, మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ నక్కా వెంకటేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ వెంకటగిరి చేనేత చీరలు ప్రాముఖ్యత కలిగినవి అన్నారు. అనంతరం చేనేత కార్మికులకు శాలువతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో హ్యాండ్‌లూమ్, టెక్స్‌టైల్ జిల్లా అధికారి పిచ్చేశ్వరరావు, తహసీల్దార్ మునిలక్ష్మి, టీడీపీ నేతలు గంగోటి నాగేశ్వరరావు, మాదాసు గంగాధర్, పులుకొల్లు రాజేశ్వరరావు, బీరం రాజేశ్వరరావు, అవ్వారు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఏపీ టెట్‌కు ఉచిత శిక్షణ

తిరుపతి సిటీ: ఏపీ టెట్–2024 పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు విద్యా సేవాసమితి అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శ్రీదేవి కాంప్లెక్స్‌లో శ్రీవిద్య ఐఏఎస్ కోచింగ్ సెంటర్‌లో ఉచిత శిక్షణ అందించనున్నట్లు కోఆర్డినేటర్ గణపతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత శిక్షణను ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, ముస్లిం మైనారిటీ నిరుద్యోగ యువతకు ఈనెల 8వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సదావకాశాన్ని తిరుపతి పరిసర ప్రాంత అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 7013119918 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఎస్వీయూలో రేపు జాబ్ మేళా

తిరుపతి సిటీ: ఎస్వీయూలోని ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కార్యాలయ అధికారి టి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. డిక్సన్ టెక్నాలజీ, విష్ణు కార్స్(మారుతీ సుజుకి అరేనా) వంటి పేరొందిన సంస్థల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ డీజిల్ మెకానిక్, డిప్లొమో ఇన్ ఆటోమొబైల్, బీటెక్, ఏదేని డిగ్రీ పూర్తి చేసిన వారు ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చని వెల్లడించారు. వివరాలకు 9533889902, 7989810194లో సంప్రదించాలని సూచించారు.

శ్రీవారి దర్శనానికి 6 గంటలు


తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 66,234 మంది స్వామిని దర్శించుకున్నారు. 26,730 మంది తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.70 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 6 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. అంతకన్నా ముందు వెళ్లితే క్యూలోకి అనుమతించరని పేర్కొంది.

తాగి దొరికితే చెరసాలకే గురూ..!

■ తిరుపతికి చెందిన ఓ వ్యక్తి రాత్రి 9.30 గంటల సమయంలో లీలామహల్ సమీపంలో ఇంటికి వెళ్తుండగా పోలీసులు ఆపి బ్రీత్ అనలైజర్‌తో పరీక్షించారు. అతను మద్యం తాగినట్లు తేలింది. అతన్ని కోర్టుకు తరలించగా అతనికి రూ.10,000 జరిమానా విధించారు.

■ తిరుపతిలోని ఇంద్రనగర్‌లో నివాసం ఉంటున్న ఓ వ్యక్తి అధిక మోతాదులో మద్యం సేవించి ఆటో నడుపుతుండగా పోలీసులు గుర్తించారు. అతనికి బ్రీత్ ఎనలైజర్‌తో తనిఖీ చేసి కోర్టుకు తరలించగా, అతనికి మూడు రోజులు జైలు శిక్ష విధించారు.

- ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నా మారని మందుబాబుల తీరు
- ఇకపై పగలు, రాత్రి అనే తేడా లేకుండా విస్తృతంగా తనిఖీలు చేపట్టేందుకు రంగం సిద్ధం
- జిల్లాలో గత 6 నెలల్లో రూ.5.87 లక్షల జరిమానా, 20 మందికి జైలుశిక్ష
- ప్రజల్లో మార్పు కోసమే తనిఖీలు.. జరిమానాల కోసం కాదు
- జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు





డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న పోలీసులు (ఫైల్)

తిరుపతి క్రైమ్: మనిషి విచక్షణను కోల్పోయేలా చేసే మద్యం మహమ్మారి.. ఎందరో ప్రాణాలను బలి తీసుకుంటుంది. మందుకొట్టి వాహనాలు నడిపే వారి మూలంగా.. ఏటా వందలాది మంది మృత్యువాత పడుతున్నారు. ఇది ప్రమాదమని తెలిసినా కొందరు పెడచెవిన పెడుతున్నారు. దీనిపై ప్రభుత్వం కన్నెర్ర చేసింది. జిల్లావ్యాప్తంగా పోలీసులు తనిఖీలు చేసి 6 నెలల కాలంలో 20 మందికి జైలు శిక్ష విధించారు. వారి నుంచి జరిమానాల రూపంలో సుమారు రూ.5.87 లక్షలు వసూలు చేశారు. నూతన ఎస్పీ సుబ్బారాయుడు బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ట్రాఫిక్‌పై పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తున్నారు. నిరంతరం డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టు చేస్తూ, మందుబాబులకు జరిమానాలు పడేలా చేస్తున్నారు. అయినా మందుబాబుల్లో మార్పులు రావడం లేదు.

రయ్‌మని వెళ్తామంటే కుదరదు..

మద్యం మత్తులో బైక్‌పై రయ్‌మని వెళ్దామనుకుంటే ఇక భారీ జరిమానాతో పాటు జైలుశిక్షకు సిద్ధం కావాల్సిందే. పోలీసు యంత్రాంగం గత కొంత కాలంగా జిల్లాలో ఆకస్మికంగా రోడ్లపై వెళ్లేవారిని ఆపి బ్రీత్ ఎనలైజర్‌తో తనిఖీలు నిర్వహిస్తున్నారు. అందులో మద్యం తాగినట్టు నిర్ధారణ అయితే మాత్రం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తుండడంతో జరిమానాలు, జైలుశిక్షలు పడుతున్నాయి. జిల్లావ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహించడానికి జిల్లా ఎస్పీ ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు రాత్రివేళ మాత్రమే బ్రీత్ ఎనలైజర్‌తో తనిఖీలు చేస్తున్నారు. ఇకపైన ఆకస్మికంగా పగలైనా, రాత్రైనా.. ఏ ప్రాంతంలో అయినా తనిఖీలు చేపట్టేందుకు రంగం సిద్ధం చేశారు.

అయితే పోలీసులు ఎన్ని కేసులు రాసినా, కోర్టులు జరిమానాలు విధించినా మందుబాబుల్లో మార్పు రావట్లేదు. తాడి వాహనం నడుపుతూ పట్టుబడుతున్న వారి సంఖ్య ఎక్కువగానే కనిపిస్తోంది. మొదటిసారి దొరికితే జరిమానా, రెండోసారి దొరికితే.. మూడు రోజుల నుంచి ఐదురోజుల వరకు జైలుశిక్ష విధిస్తున్నారు

కేసుల వివరాలు

- 022లో 1810 కేసులు నమోదు, రూ.5,17,900 జరిమానాలు విధించారు.
- 2023లో 2,578 కేసులు నమోదు, రూ.5.90 లక్షలు జరిమానా రూపంలో విధించారు.
- 2024లో ఇప్పటివరకు.. 774 కేసులు నమోదు, 644 కేసులకు 5,87,500 జరిమానా విధించారు. ఇందులో 130 కేసులు పెండింగ్‌లో ఉండగా, 20 మందికి జైలు శిక్ష విధించారు.

ప్రజల భద్రత కోసమే తనిఖీలు..



ప్రజల భద్రత, ప్రాణరక్షణ కోసమే తనిఖీలు నిర్వహిస్తున్నాం. ఎవరైనా మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటాం. వారిని అరెస్టు చేయడమే కాకుండా వాహనాలను సీజ్ చేస్తాం. విద్యార్థులు, ఉద్యోగులు డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే వారి భవిష్యత్ నాశనమైనట్టే. జిల్లాలో డ్రంక్ అండ్ డ్రైవ్ కొనసాగిస్తాం. జరిమానా విధించడం మా లక్ష్యం కాదు. కేవలం ప్రజల్లో మార్పు కోసమే. మద్యం తాగి రోడ్డు ప్రమాదంలో అనుకోని ఘటనలు చోటు చేసుకుంటే.. ఒక కుటుంబమే రోడ్డుపాలు అవుతుంది. ప్రజల్లో పూర్తిస్థాయి అవగాహన కలగాలి.

– సుబ్బారాయుడు, జిల్లా ఎస్పీ

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు

తిరుపతి లీగల్ : అధిక మోతాదులో మద్యం తాగి తిరుపతిలో వాహనాలు నడుపుతున్న ముగ్గురికి మూడు వేర్వేరు కేసుల్లో జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్‌జడ్జి గ్రంధి శ్రీనివాస్ బుధవారం తీర్పు చెప్పారు. మద్యం తాగి నగరంలో బైక్ నడుపుతున్న వైఎస్సార్ జిల్లా కడప, ఓబులవారిపల్లి, శ్రీనగర్ కాలనీకి చెందిన షేక్ బక్షుకు మూడు రోజులు జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా మరో కేసులో ప్రకాశం జిల్లా, సింగరాయకొండకు చెందిన కార్ డ్రైవర్ ఎస్.మురళీకృష్ణకు రెండు రోజుల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా, మరో కేసులో తిరుపతిలోని శ్రీనగర్ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ ఎన్.శ్రీనివాసులుకు రెండు రోజులు జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. అదేవిధంగా స్వల్ప మోతాదులో మద్యం తాగి నగరంలో వాహనాలు నడుపుతున్న 14 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. తిరుపతి అర్బన్ ఎస్పీ సుబ్బరాయుడు, ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణమాచారి ఆదేశాల మేరకు ట్రాఫిక్ పోలీసులు తిరుపతిలో పలుచోట్ల తనిఖీలు నిర్వహించి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు కోర్టు కానిస్టేబుల్ గిరిబాబు తెలిపారు.

కోర్టు సముదాయంలో ట్రాఫిక్ క్లియర్..

ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ కంట్రోల్ తిరుపతి కోర్టుల సముదాయం వద్ద బుధవారం ఉదయం ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ కంట్రోల్ చేపట్టారు. కోర్టు ప్రారంభ సమయం ఉదయం 10 గంటల సమయంలో ఒకేసారి జడ్జిలు, న్యాయవాదులు, వారి గుమాస్తాలు, కక్షిదారులు వాహనాలతో వస్తుండడంతో ప్రధాన ద్వారం వద్ద ట్రాఫిక్‌కు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. న్యాయమూర్తుల ఆదేశాలతో ట్రాఫిక్ పోలీసులు బుధవారం ఉదయం ట్రాఫిక్ కంట్రోల్ చేసి వాహనాలను పంపించారు. అలాగే కోర్టుల ప్రధాన ద్వారం వద్ద ఉన్న నోటరీలను కూడా వారు కూర్చున్న ప్రాంతం నుంచి కొద్దిగా వెనక్కి పంపారు. పోలీసులు ప్రతిరోజు ఇలాగే ట్రాఫిక్ కంట్రోల్ చేస్తే బాగుంటుందని న్యాయవాదులు అంటున్నారు.

ధాన్యం లారీ బోల్తా

- భాకరాపేట ఘాట్‌లో ఘటన
- ఒకరు మృతి, మరో ఐదుగురికి తీవ్ర గాయాలు
- మానవత్వం చాటుకున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

చంద్రగిరి: ధాన్యం లారీ బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ఐదుగురు తీవ్ర గాయాలపాలైన ఘటన బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. వరదయ్యపాళెం మండలం కళత్తూరుకు చెందిన కూలీలు బుధవారం భాకరాపేటలో ధాన్యాన్ని లారీలో లోడు చేసుకుని తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో భాకరాపేట కనుమ వద్ద డ్రైవరు మోహన్ లారీని అతివేగంగా నడపడంతో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ పైభాగంలో కూర్చున్న కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. అందులో నవీన్(30) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, మల్లిఖార్జున, ముని భాస్కర్, శేఖర్ వెంకటేష్, మణి తీవ్రంగా గాయపడ్డారు.

మానవత్వం చాటుకున్న టాస్క్‌ఫోర్స్ సిబ్బంది



క్షతగాత్రులను ప్రైవేటు వాహనంలో తరలిస్తున్న టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

భాకరాపేట వైపు కూంబింగ్ నిర్వహిస్తున్న టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ లింగాధర్ బృందం సభ్యులు లారీ బోల్తా పడి ఉండడాన్ని గమనించి పరుగులు తీశారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను అంబులెన్స్ కోసం ఎదురు చూడకుండా ప్రైవేటు వాహనాల్లో హుటాహుటిన తిరుపతి రుయాకు తరలించి మానవత్వం చాటుకున్నారు. సరైన సమయానికి క్షతగాత్రులను ఆస్పత్రికి తీసుకెళ్లిన వారిని వైద్యులు ప్రశంసించారు. ప్రమాదంలో గాయపడిన మల్లికార్జున పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యాధికారులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటర్ మోడల్ బస్ స్టేషన్ పనులు మొదలుపెట్టండి

- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి తిరుపతి ఎంపీ గురుమూర్తి విజ్ఞప్తి

తిరుపతి మంగళం: ఇంటర్ మోడల్ బస్ స్టేషన్ పనులు మొదలుపెట్టి త్వరిగతిన పూర్తయ్యేలా చొరవ తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి విజ్ఞప్తి చేశారు. బుధవారం ఢిల్లీలో కేంద్రమంత్రితో ఆయన భేటీ అయ్యారు. నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ ద్వారా రూ.500 కోట్ల నిధులతో తిరుపతిలో నిర్మించ తలపెట్టిన ఈ ప్రాజెక్టు విషయంలో రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేంద్ర మంత్రిత్వ శాఖతో చర్చించారని, అయితే.. టెండర్లు పిలిచి పనులు మొదలయ్యేలోగా ఎన్నికల కోడ్ రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయిందని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గతంలో తిరుపతి పర్యటనలో ఈ ప్రాజెక్టును త్వరలో మొదలు పెడతామని గడ్కరీ ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి తిరుపతిలో ఇంటర్ మోడల్ బస్ స్టేషన్ నిర్మాణానికి ఒక నెల రోజుల లోపు టెండర్లు పిలిచి పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎంపీ గురుమూర్తి పేర్కొన్నారు.



కేంద్ర మంత్రి గడ్కరీకి సమస్యలు విన్నవిస్తున్న తిరుపతి ఎంపీ గురుమూర్తి

తిరుపతి నుంచి కొత్త రైళ్లు ప్రవేశ పెడతారా?

తిరుపతి నుంచి వారణాసి, ఉజ్జయిని, అయోధ్య, షిర్డీలకు ప్రభుత్వం నేరుగా రైళ్లను ప్రవేశపెట్టనుందా..! వాటి వివరాలను తెలుపాలని తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి బుధవారం పార్లమెంటులో ప్రశ్నించారు. దీనికి కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ సమాధానమిస్తూ ప్రస్తుతం వివిధ ప్రాంతాల నుంచి తిరుపతి నగరానికి 130 సాధారణ రైలు సర్వీసులతో పాటు 12 ప్రత్యేక రైళ్లు ప్రధాన నగరాలు, వివిధ ప్రాంతాల మీదుగా నడుస్తున్నాయని తెలిపారు. అలాగే కొత్త రైలు సేవలను ప్రవేశపెట్టడమనేది భారతీయ రైల్వేలో నిరంతరం కొనసాగుతున్న ప్రక్రియ అని, ఇది ఆయా ప్రాంతాల్లో అవసరాలు, కార్యాచరణ, వనరుల లభ్యత వంటి అంశాలతో ముడిపడి ఉంటుందని కేంద్ర రైల్వే మంత్రి సమాధానమిచ్చారు.

నేటి నుంచి వైద్య విద్యపై రాష్ట్ర స్థాయి సదస్సులు



మాట్లాడుతున్న డాక్టర్ కిరీటి

తిరుపతి కల్చరల్: ఆంధ్రప్రదేశ్ వైద్య విద్య అధ్యాపకుల సంఘం ఆధ్వర్యంలో ఎస్వీ మెడికల్ కళాశాలలో గురువారం నుంచి 10వ తేదీ వరకు ప్రస్తుత వైద్య విద్యలో చోటుచేసుకున్న మార్పులపై రాష్ట్ర స్థాయి సదస్సులు నిర్వహిస్తున్నట్లు నిర్వాహక కమిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ కిరీటి తెలిపారు. ఆయన బుధవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. మూడు రోజుల సదస్సులకు దేశం నలుమూలల నుంచి ప్రముఖ వైద్య అధ్యాపకులు హాజరవుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా వైద్య విద్యలో ప్రపంచ వ్యాప్తంగా సంభవించిన మార్పులు, వనరులు, బోధనా పద్ధలపై పై విస్తృతంగా చర్చించనున్నట్టు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య వక్తలుగా న్యూ ఢిల్లీకి చెందిన డాక్టర్ పియూష్ గుప్తా, డాక్టర్ దేవేంద్ర మిశ్రా, డాక్టర్ అనీల్, డాక్టర్ జిమ్మీర్ హాజరవుతారని తెలిపారు. సమావేశంలో నిర్వాహక కమిటీ ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, కార్యదర్శి డాక్టర్ ప్రతిభాశ్రవంతి, ఎస్వీ మెడికల్ కళాశాల పీఆర్‌వో వీరకిరణ్ పాల్గొన్నారు.


గ్రంథ లిపిపై ముగిసిన శిక్షణ

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీ రీసెర్చ్ అండ్ పబ్లికేషన్ ఆధ్వర్యంలో రెండు వారాలుగా నిర్వహిస్తున్న శిక్షణ బుధవారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ భారతీయ భాషలు అనేకమని, అందులో ఐదో శతాబ్దానికి చెందినది గ్రంథ లిపి అని తెలిపారు. దీనిపై అధ్యాపకులకు అవగాహన కల్పించి శిక్షణ ఇవ్వడం సంతోషకరమన్నారు. దీంతో గ్రంథ లిపిలోని మాతృకలపై రీసెర్చ్ చేయడానికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందని వెల్లడించారు. భారతదేశంలోని అన్ని భాషలపై అధ్యాపకులు అవగాహన కలిగి ఉండడం మంచిదన్నారు. కార్యక్రమంలో డీన్లు సి.లలితారాణి, రజనీకాంత్ శుక్లా, ప్రొఫెసర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స కంటే నివారణే ఉత్తమం

వరదయ్యపాళెం: చికిత్స కంటే నివారణే ఉత్తమమని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తెలిపారు. బుధవారం టాటా క్యాన్సర్ కేర్ ఫౌండేషన్‌కు చెందిన తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్ అండ్ అడ్వాన్స్‌డ్ రీసెచ్(ఎస్‌వీఐసీసీఏఆర్) కేంద్రం, శ్రీసిటీ ఫౌండేషన్ సంయుక్తంగా బుధవారం 'సర్వైకల్ క్యాన్సర్, సంబంధిత వ్యాక్సిన్, పొగాకు సమస్యలు' అంశంపై శ్రీసిటీ పరిధిలోని వివిధ స్కూళ్లకు చెందిన విద్యార్థులకు, అకార్డ్‌స్కూల్, చిన్మయ విద్యాలయ, మాధనపాళెం, ఇరుగుళం జెడ్పీ హైస్కూళ్ల విద్యార్థులకు వేర్వేరుగా అవగాహన సదస్సులు నిర్వహించారు. డాక్టర్ వెంకయ్యబాబు నేతృత్వంలో నలుగురు సభ్యుల బృందం గర్భాశయ క్యాన్సర్, హ్యూమన్ పాపిల్లోమా వైరస్ వ్యాక్సిన్(హెచ్‌పీవీ), పొగాకు వాడకం వల్ల కలిగే ప్రమాదాలపై సమగ్ర అవగాహన కల్పించారు. కీలకమైన ఆరోగ్య విషయాల గురించి విద్యార్థుల్లో చైతన్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ప్రజెంటేషన్ ఇచ్చారు. ముందుగా హెచ్‌పీవీ టీకా ప్రాముఖ్యత, పొగాకు వినియోగం వ్యతిరేక నివారణ చర్యలపై నిపుణులు ప్రత్యేకంగా తెలిపారు. దీనికి సంబంధించి శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సందేశమిస్తూ గర్భాశయ క్యాన్సర్, పొగాకు ప్రమాదాలపై యువతకు అవగాహన కల్పించడం గొప్ప విషయం అన్నారు. శ్రీసిటీ ప్రాంతంలో ఆరోగ్యకరమైన జీవన శైలిని నెలకొల్పేందుకు ఈ తరహా కార్యక్రమాలు నిర్వహించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు.


పరిశోధనలతో సమాజానికి మేలు



వర్క్‌షాప్‌లో పాల్గొన్న చీఫ్ సైంటిఫిక్ ఆఫీసర్ లత తదితరులతో కళాశాల సిబ్బంది

రామచంద్రాపురం: ఫార్మసీ రంగంలో నూతన పరిశోధనలతో సమాజానికి మేలు చేకూరుతుందని ఇండో- జర్మన్ సైన్స్ అండ్ టెక్నాలజీ చీఫ్ సైంటిఫిక్ ఆఫీసర్ లత తెలిపారు. మండలంలోని వెంకట్రామాపురం సమీపంలో ఉన్న సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాలలో బుధవారం ఫార్మాస్యూటికల్ రీసెర్చ్ ఫండింగ్, బిల్డింగ్ సక్సెస్‌ఫుల్ పార్ట్‌నర్‌షిప్ అండ్ ఇన్నోవేషన్, ఎక్సలెన్స్ ఇన్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ అనే అంశంపై ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని శ్రీ పద్మావతి మహిళా పాలిటెక్నిక్ కాలేజ్ ఫార్మసీ విభాగాధిపతి పద్మావతమ్మ, తిరుపతి ఐఐటీ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి రవిశంకర్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ప్రయోగాలు, పరిశోధనలు ఎంతో అవసరమన్నారు. నూతన ఆవిష్కరణలతో కొత్త ఔషధాలను అభివృద్ధి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సెవెన్‌హిల్స్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ నిరంజన్‌బాబు, కరస్పాండెంట్ సుమలత తదితరులు పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డాక్టర్ సత్యనారాయణ

తిరుపతి సిటీ: స్థానిక ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలలో బుధవారం సెట్విన్ ఆధ్వర్యంలో పర్సనాలిటీ డెవలప్‌మెంట్, కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు స్కిల్ డెవలప్‌మెంట్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల సమాచారం కోసం ప్రభుత్వ కల్పించిన యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. సెట్విన్ మేనేజర్ మోహన్ మాట్లాడుతూ క్యాట్ పరీక్షలకు హాజరై ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్‌లో ఉన్న అవకాశాలను ఉపయోగించుకోవాలన్నారు. కొటిల్యా సీనియర్ మేనేజర్ ఎన్ఎస్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.